క్లుప్తంగా

అసైన్డ్ భూముల పరిశీలన



మధుపాడ గ్రామంలో అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని దావాలపేట, ఎన్‌జీఆర్‌పురం, మధుపాడ గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ శుక్రవారం పరిశీలించారు. ఈ మూడు గ్రామాల్లో 1600 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా భూములు ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయి, వాటి స్థితిగతులు ఏమిటన్నది పున:పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ అరుణకుమారి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

53 మందికి వైద్య సేవలు



పోషకాహార ఆవశ్యకతను వివరిస్తున్న డాక్టర్ గగన్

దత్తిరాజేరు: మండలంలోని బలభద్రరాజపురం గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా 53 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ గగన్ శుక్రవారం తెలిపారు. మధుమేహం, రక్తపోటుతో పాటు జలుబు, జ్వరం, కీళ్లనొప్పులు తదితర లక్షణాలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దీపిక, శ్రీదేవి ఉన్నారు.

కళాశాలలో స్వచ్ఛభారత్



కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

గజపతినగరం: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చల్లా శ్రీనివాసరావు సూచించారు. గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కళాశాల ఆవరణంలోని చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్-2 సుగుణకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో గదులను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

కొత్తవలస: మండలంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎం.దీపిక పాటిల్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డులు భద్రపరిచే గది, ముద్దాయిలను ఉంచే గదులను పరిశీలించారు. ఆమె వెంట సీఐ వి.చంద్రశేఖర్, ఎస్సైలు వీరజనార్దన్, బొడ్డు దేవి, సిబ్బంది ఉన్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధనలో సేవలందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రామలింగాపురం, పుర్రేయవలస, చీపురుపల్లి పట్టణంలోని విజయకాలనీ, కొత్తకుమ్మరి కాలనీ, వంగపల్లిపేటలో శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తిభావం పెరిగిందని, అన్నిచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నారని అన్నారు. వినాయక నిమజ్జనోత్సవంలో జాగ్రత్తలు పాటించాలని యువకులకు సూచించారు. వారితో పాటు ఇప్పిలి నారాయణమ్మ, ఇప్పిలి గోవింద్, పనస అప్పారావు, గెరిడి రామదాసు, పైడిరాజు, ఇప్పిలి తిరుమల, ఇప్పిలి రాము పాల్గొన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

- చంద్రబాబు తప్పు చేయబట్టే జైల్లో ఉన్నారు
- రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయుడుబాబు, హైమావతి

కొత్తవలస: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తప్పు చేయబట్టే జైల్లో కూర్చున్నారని, దీనిపై టీడీపీ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు అని రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం సమీపంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంప్ ఆఫీస్ వద్ద మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతితో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, చంద్రబాబు తప్పు చేసి తప్పించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలంతా మెచ్చుకుంటుంటే కొన్ని మీడియా ఛానల్స్, పత్రికలు మాత్రం ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నాయని దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నాయకత్వంలో నాలుగున్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అలాంటి నాయకులపై పచ్చపత్రికలు బురద జల్లుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి మాట్లాడుతూ.. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలపడం శుభ పరిణామమన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లోను, ప్రభుత్వ పథకాల అమల్లోను, పార్టీ పదవుల కేటాయింపులోను మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళా పక్షపాతిగా పేరొందారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన స్కాంలపై విచారణ మొదలైందని, ఆయన తప్పించుకోలేరన్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో ఏదో జరిగిపోతోందని కొన్ని పత్రికలు, ఛానల్‌వారు ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. తప్పుడు కథనాలను ప్రచారం చేసే ప్రత్రికలు, ఛానల్‌లపై చర్యలు తప్పవన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం లక్షల కోట్లను ప్రజలకు అందించినా ఎక్కడా కూడా పైసా అవినీతి జరగలేదన్నారు. ఎక్కడైనా పథకాల అమల్లో అవినీతి జరిగినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఐదు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గుమ్మడి సత్యనారాయణ, గొర్లె రవికుమార్, కుమార్, జగ్గుబాబు, కొత్తవలస జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, సర్పంచ్‌లు జామి ఈశ్వరరావు, బూసాల దేముడు, వెంకటరమణ, పార్టీ నాయకులు పల్లా భీష్మ, చెల్లయ్య, వెంకటన్న, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహకం



విద్యార్థికి చెక్‌ను అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన దత్తిరాజేరు ఉన్నత పాఠశాల విద్యార్థికి హైదరాబాద్‌కు చెందిన గొర్తి ఈశ్వరి ట్రస్ట్ రూ.10 వేలు ప్రోత్సాహకం అందజేసింది. పాఠశాలకు చెందిన బి.ఉపేంద్ర పదో తరగతిలో 524 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. విద్యార్థికి ట్రస్ట్ తరఫున రూ.10 వేలు చెక్‌ను అందజేసినట్లు ట్రస్ట్ ప్రతినిధి అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు పవన్ కుమార్, ఉషాబాల దంపతులు 2015 సంవత్సరం నుంచి పాఠశాల టాపర్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం రామునాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



బి.రాజేరులో పశువులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి

బొండపల్లి: పశువులను సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి రక్షించేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలో శుక్రవారం గొల్లుపాలెం పశువైద్యాధికారి జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పాటు, నట్టల నివారణ, గర్భకోశ వ్యాధుల నివారణ మందులు అందచేశారు. పశువైద్య శిబిరాలను పాడిరైతులు వినియోగించుకోవాలని కోరారు.

రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు



బిందు, తుంపర సేద్యం పరికరాలను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

బొండపల్లి: రైతులకు రాయితీపై అందిస్తున్న బిందు, తుంపర సేద్యం పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూక్ష్మనీటి పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో ఉనికెట్టి నాగలక్ష్మి భ్రమరాంబికకు చెందిన రెండు ఎకరాల్లో ఏర్పాటు చేసిన బిందు, తుంపర సేద్యం పరికరాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం రాయితీపై ఈ పరికరాలను అందిస్తోందన్నారు. కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జైన్ కంపెనీ ప్రతినిధులతో పాటు, ఏపీఎంఐపీ ఇంజినీర్ శ్రీనివాస్, దేవుపల్లి ఆర్బీకే వీఏఏ వివేక్, రైతులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న రాపాక కృష్ణమూర్తి

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ఇంగిలాపల్లిలో శుక్రవారం టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబర్ దత్తి చిరంజీవితో కలిసి వైఎస్సార్ బీమా నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

వేపాడ: మండలంలో ఖాళీగా ఉన్న రెండు గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ బీఎస్ఎన్ కూర్మనాథ్ పట్నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వావిలపాడు ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టు బీసీ జనరల్‌కు, ఆకులసీతంపేటలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టు బీసీ జనరల్ అభ్యర్థులకు కేటాయించినట్లు వెల్లడించారు. 18 సంవత్సరాల వయస్సు నిండి, పదోతరగతి పాసైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 26న దరఖాస్తుల పరిశీలన, 27న ఇంటర్వ్యూ, ఎంపికైన వారికి అదే రోజు నియామక పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

గృహసారథులకు రూ.10 లక్షల బీమా



కొండకిండాంలో గృహసారథులతో మట్లాడుతున్న చిన్నంనాయుడు

బొండపల్లి: గృహసారథులకు వైఎస్సార్‌సీపీ రూ.10 లక్షలు బీమాను కల్పిస్తోందని, గృహసారథులంతా బీమా కోసం పేర్లు నమోదు చేసుకోవాలని పార్టీ మండల నాయకుడు బోద్దల చిన్నంనాయుడు అన్నారు. మండలంలోని కొండకిండాం, రాచకిండాం, ఒంపల్లి గ్రామాల్లో శుక్రవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో గృహసారథుల వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పల్లి రఘు, ఏసీఎల్‌ఓ ఎం.శంకరరావు, ఒంపల్లి, రాచకిండాం, కొండకిండాం సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు లండా నారాయణమ్మ, దోక్కాపు ఈశ్వరమ్మ, పెద్దమజ్జి ఆదిలక్ష్మి, పెద్దమజ్జి గోపి, సీహెచ్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులు(గెస్ట్ లెక్చరర్)గా బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఎకనామిక్స్, తెలుగు, గణితం, ఫిజిక్స్, కామర్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రజలకు ఆరోగ్య సేవలందించేందుకే..



సురక్ష సర్వేలో భాగంగా బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

గంట్యాడ: ప్రజల ఆరోగ్య చరిత్ర తెలుసుకోవడం కోసం ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీటీసీ పోటుపురెడ్డి భవాని, సర్పంచ్ వి.పాపునాయుడు పేర్కొన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో పాల్గొని మాట్లాడారు. ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సర్వేలో గుర్తించిన వ్యాధిగ్రస్తుల కోసం ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ ఎర్రన్న, సీహెచ్ఓ అనూష, ఏఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.

శంబలనగరి ఆశ్రమం సందర్శన



గాయత్రీమాతను దర్శించుకుంటున్న మనోహర్‌దాస్

శృంగవరపుకోట: మండలంలోని రాజీపేట గ్రామంలో ఉన్న శంబలనగరి ఆశ్రమాన్ని తిరుపతి ఇస్కాన్ టెంపుల్ సనాతన ధర్మ ప్రచారకర్త మనోహర్‌దాస్ శుక్రవారం సందర్శించారు. పంచలోహ గాయత్రీ మాత విగ్రహాన్ని, దేవతామూర్తుల విగ్రహాలను దర్శించుకున్నారు. శివలింగానికి అభిషేకం చేశారు. ఆశ్రమం విశిష్టతను ఆశ్రమ ప్రతినిధులు సుబ్బారావు, కిషోర్ ఆయనకు వివరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కె.కృష్ణాపురంలో అవగాహ కల్పిస్తున్న కార్యదర్శి, వైద్య సిబ్బంది

దత్తిరాజేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ అన్నారు. మండలంలోని కె.కృష్ణాపురం, కోమటిపల్లి గ్రామాల్లో శుక్రవారం 'స్వచ్ఛతా హే సేవా' కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. మోటివేటర్ ఆర్.గోవింద్ మాట్లాడుతూ..ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, భోజనం చేసేముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, ఉతికిన దుస్తులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

లక్ష్మీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు

బొండపల్లి: రాజరాజేశ్వరి అమ్మవారు శుక్రవారం లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ధూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక





జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన సర్వేపల్లి పాఠశాల, కౌముది పాఠశాల విద్యార్థులు

శృంగవరపుకోట: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో స్థానిక సర్వేపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు రాణించారు. అండర్-17 విభాగంలో వై.నరేంద్ర, ఎం.జగదీష్, సి.హెచ్.సిద్ధు, వి.సాయితనీష్, పి.త్రిష, అండర్-14 విభాగంలో ఎ.ఘనశ్యామ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సన్యాసిరావు శుక్రవారం తెలిపారు. ఎంపికై న విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు సురేష్, జయరాజ్‌లను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

- పట్టణంలో స్థానిక కౌముది గ్లోబల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించినట్లు పిన్సిపాల్ శాంతి మహంతి చెప్పారు. అండర్-14 విభాగంలో ఎం.నాగేష్, మణీంధ్ర, సి.హెచ్.నవీన్, అండర్-17 విభాగంలో కె.రేష్మ, ఎస్.హరిరాఘవి, పి.వర్షిణి ఎంపికయ్యారు. విద్యార్థులతో పాటు పీఈటీ కె.ఎస్.నాయుడును పాఠశాల సిబ్బంది అభినందించారు.

సంగీత, ధ్యాన, నృత్యాలతో ఆధ్యాత్మికత విలువలు



మాట్లాడుతున్న ఆనందో బ్రహ్మ సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వీఎస్ గోపాలకృష్ణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

- ఆనందో బ్రహ్మ సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వీఎస్ గోపాలకృష్ణ

విజయనగరం టౌన్: సంగీతం, ధ్యానం, నృత్యంలతో ఆధ్యాత్మికత విలువలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గాను పిరమిడ్ స్పిరిట్యువల్ టాబ్లెట్స్ సొసైటీ, పీఎస్ఎస్ఎమ్, ఆనందోబ్రహ్మ యూత్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో వర్క్‌షాప్‌లు, సినీ, సంగీత విభావరి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆనందో బ్రహ్మ సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వీఎస్ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక జీఎస్ఆర్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విజయనగరం పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి పది వరకు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పిరమిడ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జె.రామారావు, కార్యక్రమ సీఈఓ తులసి, కనకమహాలక్ష్మి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

● సహస్ర దీపాలంకరణ



శివలింగం, స్వస్తిక్, ఓం ఆకృతిలో దీపారాధన

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో సీతారామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద గురువారం రాత్రి సహస్ర దీపారాధన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివలింగాకారం, ఓం, స్వస్తిక్ ఆకృతిలో దీపాలు అలంకరించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అన్నసమారాధన నిర్వహించగా.. వేపాడ, వల్లంపూడి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

పండగపై ప్రచారం చేయాలి



ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి, ట్రస్ట్ బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: సిరులతల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అక్టోబర్ 4వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో పైడితల్లి దీక్షలతో పాటు ప్రధాన ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవం, తెప్పోత్సవం, ఉయ్యాల కంబాల ఉత్సవాల విశిష్టతలను వివరిస్తూ ఊరూరా ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రచారరథాన్ని ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో భక్తులు, దీక్షాపరులతో ఉత్తరాంధ్ర అంతటా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ వేదపండితులు, దాతలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

